# జీతాలు అందక పంచాయతీ కార్మికుల ఇబ్బందులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 18 : మండలంలోని ఆసుపాక పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులు 6 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో పిచ్చయ్య, గంగయ్య, రాము, రాంబాబు, రామారావులు పని చేస్తున్నారు. వీరు ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరుకు పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, నర్సరీ, వీధిలైట్లు, 'పచ్చదనం-స్వచ్ఛదనం' కార్యక్రమంలో పనులు చేస్తున్నారు. ప్రతి నెల చెల్లించవలసిన వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఆ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు గడవడానికి అప్పులు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు చెల్లించకపోతే మా జీవితాలు ఎలా అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. పంచాయతీకి నిధులు రావడం లేదని, కేంద్రం నుంచి వచ్చిన నిధులు అత్యవసర పనులకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు చెప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల పారిశుధ్యం పనులు చేయకపోతే దోమలు పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందిపడతారనే ఉద్దేశంతోనే తాము పనులు కొనసాగిస్తున్నామని, రెండు రోజులుగా కరెంటు లేకపోవడంతో తాగునీరు ట్యాంక్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.



ఆసుపాక గ్రామపంచాయతీ కార్యాయలం

### 6 నెలలుగా జీతాలు లేవు



6 నెలలుగా జీతాలు లేవు. పూట గడవడం కష్టంగా ఉంది. కిరాణ షాపు వద్ద సరుకులు అప్పుగా తీసుకుంటున్నాను. చాలా అప్పులు అయ్యాయి. ఇక అప్పు ఇవ్వమంటున్నారు. సెప్టెంబర్ వస్తే 7 నెలలు అవుతుంది. ఎలా కుటుంబాలను గడుపుతున్నామో, ఆ బాధలు మాకు తెలుసు. వెంటనే జీతాలు చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

–రాంబాబు, ఆసుపాక

### నిధులు లేవు అంటున్నారు...




గ్రామ పంచాయతీలో నిధులు లేవు, వచ్చిన తరువాత జీతాలు వేస్తాము అంటున్నారు. ఈ మాటలతోనే 6నెలలు గడిచిపోయాయి. ఇంటిలో చాలా ఇబ్బందులు పడుతున్నాము. వెంటనే సగం జీతాలు ఇచ్చే అయిన మా కుటుంబాలను ఆదుకోవాలి

–రామారావు, ఆసుపాక

# 'దృశ్య'కావ్యం

- ఒక 'చిత్రం'.. లక్షల మాటలను మించిన భావం..
- ఆనందానుభూతులు, విషాద'ఛాయ'లు మేళవించిన 'రూపం'
- నేటి ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ ప్రత్యేక కథనం..
- ఛాయాగ్రాహకంలో ముందు వరుసలో జిల్లా ఫొటోగ్రాఫర్లు




జిల్లా ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాల్లో అవార్డు పొందిన ఫొటో

ఖమ్మం/ తిరుమలాయపాలెం, ఆగస్టు 18: ఒక్క చిత్రం.. లక్ష మాటలను మించిన భావం. వేనవేల జ్ఞాపకాల దొంతరల సమాహారం. ఎప్పటికీ చెరగని రూపం. అదే.. ఆనందానుభూతులు, విషాద'ఛాయ'లు మేళవించిన 'దృశ్య'కావ్యం. అందుకే ఆ దృశ్యా'నికి, దాని చిత్రీకరణకు అంతులేని ఆదరణ. అదే.. ఛాయాగ్రాహకం. మనం సంతోషంగా ఉన్నప్పటి మధుర స్మృతులనే కాకుండా.. మనతోలేని వారి జ్ఞాపకాలను కూడా మరోసారి తనవితీరా చూపించే సాధనమే ఫొటోగ్రఫీ. అంతటి ప్రాధాన్యం ఉందని కాబట్టే కాలాలు, సాంకేతిక పరిజ్ఞానాలూ మారినా దాని రూపం ఎప్పటికీ సజీవంగానే నిలిచిపోతోంది. ఒకప్పటి మన ఫొటోలు ఆల్బమ్‌లలో నిండిపోయినా.. నేటి టెక్నాలజీని ఒడిసిపట్టుకున్నాక గ్యాలరీల్లో నిండిపోయినా దాని నిర్వచనం మాత్రం ఎప్పటికీ చెరిగిపోని చిత్రంగానే నిలిచిపోతుంది. అయితే ఎంతో సృజన, పోటీతత్వం ఉంటే ఫొటోగ్రఫీలో జిల్లాలోని ఎందరో ఫొటోగ్రాఫర్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు. ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంటున్నారు. జిల్లా కీర్తిపతాకను నలుదిశలా ఇనుమడింపజేస్తున్నారు. నేటి ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అలాంటి ఓ ఇద్దరు ఫొటోగ్రాఫర్ల సృజనశీలతే ఈ కథనం..

### ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చిన అంజిత్..


ఖమ్మం పూర్వ కలెక్టర్ కర్ణన్ నుంచి అవార్డు అందుకుంటున్న అంజిత్ (ఫైల్)

ఖమ్మం జిల్లా సువర్ణాపురం గ్రామానికి చెందిన వినుకొండ అంజిత్.. తన జీవితంలోనూ, వృత్తిలోనూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చిన ప్రముఖ ఫొటోగ్రాఫర్‌గా నిలిచాడు. కెమెరామెన్‌గా, ఈవెంట్ మేనేజర్‌గా, లఘు చిత్రాల దర్శక, ఛాయాగ్రాహకుడుగా, వెండితెర అసిస్టెంట్ కెమెరామెన్‌గా తనదైన ముద్ర వేసుకున్నాడు. 2010లో ఫొటోగ్రఫీ రంగంలో అడుగుపెట్టిన ఆయన.. అనతికాలంలో అద్భుత ప్రతిభతో రాణించాడు. 2012లో సినీ రంగం వైపు అడుగులు వేసి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదిగాడు. మరోవైపు ఫొటో ఆల్బమ్‌లు డిజైన్ చేస్తూ పలువురికి ఉపాధి కల్పించాడు.

### నేడు ఏఎన్‌యూలో మైనుద్దీన్‌కు అవార్డు..


ఫొటోగ్రఫీ దినోత్సవంలో అవార్డు అందుకుంటున్న షేక్ మైనుద్దీన్ (ఫైల్)

తిరుమలాయపాలెం మండలం జింకలగూడేనికి చెందిన షేక్ మైనుద్దీన్ చిన్నతనం నుంచే ఫొటోగ్రఫీ వృత్తిపై మక్కువ ఎక్కువ. పరుగులు పెడుతున్న కాలగమనంలో వివిధ జాతుల జీవనశైలి, సంస్కృతీ సాంప్రదాయాలపై ఫొటోలు చిత్రీకరించాడు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో వివిధ సంస్థలు ఇంటర్నెట్ ద్వారా నిర్వహిస్తున్న అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో పాల్గొనేవాడు తాను తీసిన అపురూప, అసాధారణ ఫొటోలను అక్కడ ప్రదర్శించాడు. ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 34 అవార్డులను అందుకున్నాడు. 240 ఫొటోలు ఫెడరేషన్ ఆఫ్ పొటోగ్రఫీ అనుమంతిపొందాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ఏపీలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన కలర్ ఫొటోగ్రఫీ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. సోమవారం ఏఎన్‌యూలో అతడు ఆ అవార్డును అందుకోబోతున్నాడు.

# రాఖీ కట్టేందుకు వెళ్తూ మహిళ దుర్మరణం

- ఖమ్మంలో రోడ్డుపై నడుస్తుండగా ఢీకొన్న కారు
- చౌటపల్లిలో విషాదఛాయలు


ప్రమాదానికి గురైన కారు

మామిళ్లగూడెం, ఆగస్టు 18 : తమ్ముడికి రాఖీ కట్టేందుకు వెళ్తూ కారు ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఖమ్మం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం చౌటపల్లికి చెందిన గాజుల మల్లమ్మ(58) ఖమ్మం ఖానాపురంలో నివసించే తమ్ముడు వీరయ్యకు రాఖీ కట్టేందుకు బయలుదేరింది. బస్సు దిగి బైపాస్ రోడ్డులో పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొంది. ఈ ఘటనలో మల్లమ్మ ఎగిరి రహదారి పక్కన ఉన్న ఓ హోటల్ ఎదుట నిలిపిన ద్విచక్రవాహనాలపై పడి అక్కడిక్కడే మృతిచెందింది. కారు రోడ్డుపక్కన ఉన్న కరెంట్ నియంత్రిక దిమ్మెను ఢీకొని నిలిచిపోయింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవర్‌తోపాటు మరో ప్రయాణికురాలు గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. మల్లమ్మ కుమారుడు సుకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.











